

కథ

# విముక్తి

– వలివేటి నాగచంద్రావతి

మెడమీద చెయివేసి విసురుగా బైటకు నెట్టి భళ్ళున తలుపులు మూసేసుకున్నాడు కుమార్.

భర్త తోసిన తోపుకు పడబోయి ఎలాగో నిలదొక్కుకున్నది శారద. మూసుకున్న తలుపుల వంక అలాగే చూస్తూ నిలబడిపోయిందొక క్షణం. ఆపైన ద్వారబంధాన్ని పట్టుకుని కుప్పకూలినట్టుగా జారి కూర్చుండిపోయింది.

గాయపడిన హృదయం తీవ్రంగా ఆక్రోశిస్తోంది. కానీ బాహాటంగా కంటి వెంట నీటిచుక్క రాలటంలేదు. భరించనలవికాని వ్యధతో వేదనతో మొహం మాత్రం పాలిపోయింది.

తల గోడకి ఆన్చి కళ్ళు మూసుకున్నది శారద.

పక్కింటి కిటికీ తటపటాయిస్తూ తెరుచుకుని ఆదరాబాదరా మూసుకున్న సవ్వడి వినిపించింది.

అప్పుడు నిండాయి శారద కనుకొలుకులు నీటితో.

ఏ వడిదుడుకులూ లేకుండా అతిసాధారణంగా బ్రతకాలనుకుందే తప్ప ఆకాశహర్మ్యాలకు ఆశపడలేదే- తన జీవితమింత అస్తవ్యస్తమూ, పరిహాస భాజనమూ అయిందేమిటి?

ఇందులో తన తప్పిదమేమిటి? అతని బాధ్యత ఎంత?

★ ★ ★

"మీరేమీ సంశయించకండి నాన్నా. నేను పూర్తిగా ఇష్టపడే చెప్తున్నాను. మీరా సంబంధం నిశ్చయం చేయండి" అన్నది శారద. ఎటూ పాలుపోని స్థితిలో సతమతమవుతున్న తండ్రిని అభిమానంగా చూస్తూ.

ఆమెకు తెలుసు. పెద్ద కూతురు శార్వాణి పెళ్లితోనే సగం కుదేలయినాడు తండ్రి. ఆపైన మూడేళ్లనించీ పంటలు పండకపోవటంతో మరింత అప్పులపాలయినాడు. పోనీ తనతో ఆయన బాధ్యతలు తీరిపోతాయా అంటే అదీ లేదు. తన తర్వాత పిల్ల శాంతి కూడా పెళ్లికి ఎదిగివుంది. మెడిసిన్ చదువుతున్న పెద్ద తమ్ముడికి నెలనెలా పెద్దమొత్తాలు పంపవలిసి వుంది. టెన్త్ పాసయిన ఆఖరివాడిని ఇంకా పైకి తీసుకురావాల్సిన అవసరమూ వుంది. పెద్దపెద్ద కోరికలు కోరి తనింకా ఆయన బరువు పెంచదలుచుకోలేదు.

"వెర్రి తల్లీ! ఈ బడుగు తండ్రి ఇంతకంటే గొప్ప సంబంధం ఏం తేగలడులే అని సరిపెట్టుకుందామనుకుంటున్నావా అమ్మా!" బాధగా అన్నారు సీతారామయ్యగారు.

కూతుర్ని వున్న ఇంటికి ఇవ్వాలనీ, కోడల్ని లేని ఇంటినుంచి తెచ్చుకోవాలనేది ఆయన సిద్ధాంతం.

అలాఅనే పెద్దపిల్ల శార్వాణికి వెతికివెతికి ఆస్తిపరుడూ, ఎంచి ఎంచి అందగాడూ అయిన వరుణ్ణి తమకు మించిన సంబంధమే అయినా తెచ్చి పెళ్లిచేశారు.

కానీ ఇప్పుడు... ఆ నమ్మకమయితే చెక్కు చెదరలేదుకానీ ఆర్థికస్థితి మాత్రం ఆ ప్రయత్నాలికి దోహదపడ్డంలేదు.

" సరిపుచ్చుకుంటున్నానని ఎందుకనుకుంటున్నారు నాన్నా! అతనికేమి లోపమని?" తలదించుకుంటూ అన్నది శారద.

నిజమే. వరుడు కుమార్‌కి లోటేమన్నా వుంటా-? వుంది అనుకుంటే వుంది - లేదనుకుంటే లేదు.

కుమార్ అందగాడు కాదు. అలాని వికారంగా ఏమీ వుండడు. కొంతమందికి ఏ అవయవానికా అవయవం తగిన పరిమాణంలో తీరుగానే ఉన్నట్టున్నా మొత్తంగా కలిపిచూస్తే ఆ ఆకారం అంత ఇంపుగా వుండదు. ఆ కోవలోనివాడే కుమార్. పెద్ద అల్లుడితో పోలిస్తే దివిటీ ముందు దీపంలా వుంటాడు. ముఖ్యంగా స్వర్ణ ప్రతిమలాంటి శారద పక్కన కట్టెపేడులా వుంటాడు కుమార్.

ఇక ఆస్తిపాస్తులు చూస్తే నెత్తిమీద జుట్టుతప్ప మరేం లేదు. ఈ మైనస్ పాయింట్లమీద ప్లస్ పాయింటేమిటంటే అతనికి పర్మినెంటయిన తాలూకాఫీసు ఉద్యోగముంది. ఇంకొకటి - శారదని చూసి కట్నం మీరెంతిచ్చినా సరే అన్నాడతను. అదే శారదను అతనంటే మెత్తపరిచిన విశేషం -

"నువ్వెంత చెప్పినా నా మనసొప్పకుండా వున్నదమ్మా" అని అన్న సీతారామయ్యగారికి పరిస్థితులకు తగ్గట్టుగా నడుచుకోవాలన్న భార్యా, కూతురూ వత్తిడికి తలఒగ్గక తప్పలేదు.

శారద వివాహం కుమార్‌తో జరిగిపోయింది.

అందరి ఆడపిల్లల్లా కోటికోరికలతో అనంతమైన ఆశలతో భర్త ఇంట కాలుపెట్టలేదు శారద. తృప్తికి మించిన ఐశ్వర్యం లేదని తెలుసు ఆమెకు. బ్రతుకు దేవుడిచ్చిన వరమనీ. జీవితంలో దొరికిన దానినే అందుకోవాలనీ, అందులోనే ఆనందం వెతుక్కోవాలనే తత్వం ఆమెది. ఆ ఆనందాన్ని వెతికి పొందగలననే ఆత్మవిశ్వాసంతోనే మగని ఇంట గృహప్రవేశం చేసింది శారద.

కాపురానికి వెళ్లిన కొద్దిరోజుల్లోనే శారదకు భర్త ఆకారంలో అందం లేకపోవటమొక్కటే కాదు - అతనిలో ఆత్మసౌందర్యం కూడా లోపించిందన్న విషయం తెలిసివచ్చింది.

కుమార్ తరహా అదోరకం.

అందరికిలా పెళ్లయిన తొలిదినాల్లోనయినా పెళ్లామంటే మోజు కనబరచలేదతను. కొత్త జంట నడుమ వెల్లివిరియవలిసిన ఉత్సాహం, ఉల్లాసం, విలాసాలూ, విహారాలూ, ఎదమీటే మధుర సన్నివేశాలూ శారదకనుభవానికి రానేలేదు.

మొదటిరోజు అతనితోపాటుగా తనూ కంచం పెట్టుకుంది శారద - కబుర్లు చెప్పుకుంటూ తినవచ్చనే కోరికతో. "ఇదేమిటి? ఇంటి మగవాళ్లు తింటేగానీ ఆడవాళ్లు తినగూడదని తెలీదా నీకు. ఇది గూడా చెప్పలేదా మీ అమ్మ నీకు?" అన్నాడు అదో పెద్ద అపరాధంలాగ.

అంతే. మనస్సు చివుక్కుమని శారద మళ్లీ అలాటి సరదాలకి ప్రయత్నించలేదు.

ఇలాంటి వాటికి కొంతమంది స్వభావం ఇంతేనని సరిపెట్టుకోగలిగింది కానీ అతని అలవాట్లనీ, చేష్టల్నీ మాత్రం సరిపుచ్చుకోలేకపోయింది శారద. ముఖ్యంగా శుభ్రత విషయంలో. అతనికీ శుభ్రతకీ ఆమడదూరం. రోజూ స్నానం చెయ్యాలనే నియమంగానీ, బట్టలు శుభ్రంగా వుంచుకోవాలనే పట్టింపుకానీ అతనికి వుండేవి కావు.

"ఎండాకాలమయితే చిరాగ్గానీ, చలికాలం కూడా రోజూ స్నానమెందుకు? మొహం సబ్బుతో రుద్దుకుంటే పోలా" అనేవాడు నిర్లక్ష్యంగా.

'రోజూ విధిగా స్నానం చెయ్యటం ఆరోగ్యమనీ, రోగాలు దరికి రావనీ - ప్రాథమిక ఆరోగ్యసూత్రాలు బోధించటానికి, అతనేమన్నా చిన్నపిల్లవాడా - చదువుకుని ఉద్యోగం చేస్తున్న చెట్టంత మనిషే...!'

పోనీ బట్టలన్నా మారుస్తాడా అంటే ఊహూ - ఆ పనికూడా వారానికి ఏ ఒక్కసారో - అతనిచేత రోజూ బట్టలు... కనీసం అండర్‌వేరన్నా మార్పించుదామని చూసిన శారద ప్రయత్నం విఫలమయింది.

అతను దగ్గరకి వస్తే అదోరకం ముంజు వాసన. ఒళ్లు జలదరించిపోయేది శారదకు.

"ఛ ఛ ఆ మురికితో మీరెలా వుండగలుగుతున్నారో కానీ మీ సరసకి రావాలంటేనే కంపరంగా వుంటోంది నాకు" దాగలేని అసహ్యత అనుకోకుండానే వెలువడిపోయిందామె నోటివెంట.

అంతే. ఎంత అనునయించి చెప్పినా రాని రియాక్షన్ దానితో వచ్చింది. మళ్లీ ఎలాగ! ఉప్పెనలాగ.

శారదామాట అన్నప్పుడు వెంటనే ఏమీ అనలేక గుటకవేసి చేదు మింగినట్టు మింగి వూరుకుని ఆ తరవాత భోజనం చేస్తూ ఉత్తపుణ్యానికి విరుచుకుపడ్డాడు.

"ఇదేం కూర - ఇదేం పచ్చడి. గొడ్లు కూడా తినవీ తిండి" అంటూ నిక్షేపం లాంటి కూరకీ, పచ్చడికీ వంకపెట్టి, కంచం విసిరి, వంట ఇల్లంతా రణరంగంచేసి వీధిగుమ్మంలో కొచ్చేసి వచ్చింరోజు దగ్గర్నించీ తనకి రోజూ ఎచ్చీపచ్చీ మెతుకులే పెడుతున్నట్టు పదిళ్లకి వినపడేలా అరిచి బిక్కచచ్చి నిలబడిన శారదని నానా దుర్భాషలాడి లేచ్చక్కాపోయాడు.

కొన్నిటికి గూఢార్థమిదీ అని భాష్యం చెప్పక్కరలేదు. మనసుకే కారణమిదిసుమా అని తెలిసిపోతూ వుంటుంది.

రాత్రి తన విదిలింపుకి ఇది ప్రతి క్రియ అని శారద గ్రహించుకున్నది.

'తన కోపం తీర్చుకోడానికి న్యాయంలేని నింద వెయ్యటమేకాదు - తన మనిషి అన్న విచక్షణ కూడా లేకుండా ఎంత ఆగం చెయ్యటానికన్నా వెనుతియ్యడన్నమాట. 'మగనిలో మరో వికృత కోణం తెరతీసి చూసినట్టయింది శారదకి.

ఆలుమగలు తమ ఇద్దరి మధ్యా వుండాల్సిన స్వల్ప కలహాన్ని వీధికెక్కించటంలో కుమార్ అభిప్రాయం తన మగ ప్రతాపం చాటుకోవటమో లేకపోతే అల్లరికి వెరిచే ఆమె సంస్కారాన్ని ఆసరాగా దెబ్బతీసి నోరు నొక్కటమోకానీ శారద మాత్రం భర్త ఈ సిగ్గుమాలిన చేష్టకి అవమానంతో కుచించుకుపోయింది.

తన్నతడు అర్థం చేసుకోకపోవటం, పరాయివాడిలా, శత్రువులాగా నలుగురిలో నగుబాటు పాలు చేయటం మరింత బాధించిందామెను.

అయినా అది అతనిదే పూర్తి తప్పుగా భావించలేదు శారద. అతని మనసుకు హత్తుకునేలా చెప్పలేకపోవటం తనదే లోపమని పశ్చాత్తాపపడింది.

తానింకా అతనికి కొత్త. కొన్నాళ్లుపోతే తన తత్వం అవగాహన చేసుకుంటాడు. ఆదరిస్తాడు. తన పంథా మార్చుకుంటాడు; అనే ఆశపడింది.

కానీ కుమార్ గుణాలు తాత్కాలికమైనవి కావు; పాతుకుపోయిన దుర్లక్షణాలు.

అన్నీ చెడ్డబుద్ధులేనా అంటే కావు - కొన్ని సుగుణాలున్నమాట నిజమే.

సిగరెట్, పేకాట వంటి వ్యసనాలే కాదు కనీసం వక్కపొడి నమలటం వంటి చిట్టిపొట్టి అలవాట్లు కూడా లేవు. కుమార్‌కి ఏ పనన్నా తలపెడితే అది పూర్తిచేసేదాకా నిద్రపోని పట్టుదల వుంది. ఇరుగుపొరుగు వారితో మహా సామరస్యంగా వుంటాడు. ఆఫీసులో కూడా చాలా నిజ



యితీపరుడనీ కష్టపడి పనిచేస్తాడనీ పేరు.

ఈ క్వాలిఫికేషన్లు పైవాళ్లకి అతనంటే సదభిప్రాయాన్నే కలిగిస్తాయి.

కానీ ఇతరులకి తెలీనివీ, ఇంట్లో వాళ్లకి చికాకూ ఇబ్బందీ కలిగించే అంశాలు ఈ మంచి అలవాట్లకి రెట్టింపున్నాయి అతనిలో.

అతనికి సభ్యతా సంస్కారమూ అంటే ఏమిటో తెలీదు. సరదాలూ సరాగాలూ గిట్టవు. నాజూకూ నాగరికతా లాంటి బలహీనతలు లేవు. ఇవీ అని చెప్పుకునే ప్రిన్సిపుల్స్ లేవు. ఇల్లూ ఆఫీసూ తప్ప స్నేహితులూ షికార్లూ వంటి వ్యాపకాలు లేవు.

పనిగంటలు మినహాయిస్తే ఇంట్లోనే ఎప్పుడూ మకాం. పోనీ ఏ పుస్తకమో పుచ్చుకు కూర్చుంటాడా అంటే అదీలేదు. ఎప్పుడూ పెరటి గుమ్మంలో నిలబడి పంపుదగ్గర నీళ్లు పట్టుకోడానికి వచ్చే ఆడంగుల్తో "పిన్నీ" "వదినా" అంటూ ఆడంగి కబుర్లు చెప్పడం, వయసొచ్చిన ఆడపిల్లల ముందర ముతక జోకులెయ్యడం; పనిపిల్లతో మోటు సరసాలాడ్డం... అదీ కాలక్షేపం.

మగవాడికి అందమిచ్చే హుందాతనం, ఠీవీ మచ్చుకయినా లేవతనిలో. మహా చవకబారుగా ప్రవర్తించేవాడు. ఆ వెకిలితనం, నాటుతనం చూస్తూ ప్రశాంతంగా వుండగలగటానికి ఎంతో నిగ్రహం కావాల్సి వచ్చేది శారదకి.

తమ నడవడిక ఎదుటివారికి నచ్చటంలేదని తెలిస్తే ఎలాటివారైనా కాస్త జంకుతారు. కుమార్ అందుకు పూర్తిగా విరుద్ధం.

'మీ ప్రవర్తన ఎబ్బెట్టుగా వుంది. దాని మూలాన మీ విలువ మీరే తగ్గించుకుంటున్నారు' అనే విషయాన్ని ఎంత సున్నితంగా హితవుగా చెప్పబోయినా 'నువ్వు నాకు చెప్పొచ్చేదానివా అన్నట్టు కోరగా చూసి అక్కణ్ణించి మరీ విజృంభించి శారద చిరాకుపడే పనులు- బయటనించి వచ్చి కాళ్లు కడుక్కోకపోటం మాట అటుంచి తుడుచుకోనన్న తుడుచుకోకుండా మంచమెక్కి శుభ్రమైన దుప్పటంతా ఖరాబు చెయ్యటం, కర్టెనుకి చేతులు తుడవటం, సర్దిపెట్టిన ఇల్లంతా చిందరవందర చెయ్యటం, మరి రెండు రోజులు స్నానం మానెయ్యటం... కావాలని ఇలాంటివి పదేపదే చేసేవాడు.

కూచుంటే తిట్టి నుంచుంటే తిట్టి రభసచేసి కొన్నాళ్లపాటు నరకమెక్కడో లేదు అనిపించేవాడు.

ఈ చిత్రహింస భరించలేక శారద కళ్లనీళ్ల పర్యంతమైతే తప్ప శాంతించేవాడు కాదు.

ఎంతగా ఎదిగిపోయిన స్త్రీ అయినా తన భర్త తనకంటే అధికుడిగా, ఉన్నతుడిగా వుండాలనే అభిలషిస్తుంది. జీవితాంతం కలిసి బ్రతకవలసిన పురుషుడు తనకన్నా అధముడైతే అంతకన్నా దౌర్భాగ్యం ఆడదానికి లేదేమో.

రూపంలో వర్చస్సులో లేకపోతే మానె- వ్యక్తిత్వం లోనైన ఉదాత్తతలేని భర్త అంటే విముఖతే పెరుగుతోంది శారదకి.

పోనీ అతని సంగతి ఆలోచించటం మాని కామ్‌గా తన పనేదో తను చూసుకుందామంటే అలానూ బ్రతకనిచ్చేవాడు కాదామెను.

ఎప్పుడూ రంధ్రాన్వేషణే. ఆమె చేసే ప్రతి పనీ పట్టిపట్టి చూస్తాడు. "అంట్లకి అంత సబ్బు పొడా?" అనీ, "పోపుకి అంత నూనా?" అంటూనో తప్పులెన్నుతూ కళ్లెర్ర చేస్తాడు. నా పెళ్లాన్నెంత అదుపులో పెడుతున్నానో చూడండన్నట్టు అటువాళ్లూ ఇటువాళ్లూ తొంగిచూసేలా గొంతుపెంచి అరిచేవాడు. రాచిరంపాన పెట్టేవాడు.

భయపడిపోయింది శారద. అతనితో కాపురం కత్తిమీద సామయిపోయింది. అతన్ని సంస్కరించాలనే మాట అటుంచి అతనితో మామూలు మాటలు మాట్లాడాలన్నా జంకేది. స్వతంత్రించి అది సామాన్యమైన పనే అయినా వెనకాతల అతను లేడుకదా అని తిరిగిచూసుకునేది.

వారాలూ నెలలూ గడుస్తోన్నాఆ ఇల్లూ ఆ భర్తా తనకు పరాయి అన్న భావన పోవడంలేదు శారదకి.

తనమీద విశ్వాసం, తనంటే అనురక్తీ ఆకర్షణా లేవతనికి. తన సహచర్య మతనిలో మార్పు తెస్తుందనీ, తన ప్రవర్తనా పద్ధతులూ సరిదిద్దుకుంటాడనీ ఇంకెలా ఆశించగలదు. అతన్ని ఆకట్టుకోగల సత్తా తనకు ఏమాత్రం లేవని నిర్ణయించేసుకున్నది శారద.

సుమతీ శతకకారుడు చెప్పినట్టు కొంతమంది మహానుభావులు వుంటారు; తివిరి ఇసుమున తైలం తియ్యొచ్చునేమోకానీ వాళ్ల మనసును రంజింపచెయ్యాలనుకోటం కేవలం పిచ్చితనం.

ఆ వూరికి ఈ వూరెంత దూరమో, ఈ వూరికీ ఆ వూరూ అంతే దూరమన్నట్టుగా- అతనికి తనంటే అనురాగం అభిమానం లేవు. తనకీ అతనంటే తిడతాడేమో, అల్లరి పెడతాడేమో అన్న వెరపూ భయం తప్ప భక్తీ గౌరవాలు కలగటంలేదు.

అయినా ఆ మనిషి దయాదాక్షిణ్యాలమీద తన జీవితమూ, తన భవిష్యత్తూ ఆధారపడివున్నాయని ఈ సమాజం నిర్దేశించింది. ఇష్టమయినా కష్టమయినా ఈ జన్మ అతనితో తెల్లవారవలసిందే. జీవితాంతం ఇష్టంలేని మనిషితో కాపురం ఈడ్వాల్సిందే.

మానసికంగా కృంగిపోయిన శారద ఇరవయిలోనే నలభయి ఏళ్ల వయసొచ్చినదానిలా నిర్వికారమూ నిర్లిప్తతా అలవర్చుకుని రోజులు గడపసాగింది.

కానీ విధి ఆమాత్రంగా కూడా ఆమెను బ్రతకనివ్వలేదు.

★ ★ ★

ఆరోజు సాయంత్రం వంట ఇంట్లో పనిలో వుంది శారద. వీధి తలుపు చప్పుడయితే, చేతిలో పని ఆపి వచ్చి తలుపు తీసింది.

వచ్చింది శ్రీధర్. వాళ్ల వూరే. ఆమె ఫ్రెండ్ సుజాతకి తమ్ముడతను.

"నువ్వా? ఎప్పుడొచ్చావ్?" అడ్డు తొలగి అతనికి దారిఇస్తూ సంభ్రమాశ్చర్యాలతో ప్రశ్నించింది శారద.

"ఇక్కడి కాలేజీలో సీటొచ్చింది శారదా నాకు. నాలుగురోజుల క్రితమే వచ్చి జాయినయ్యాను. సుజా మీ ఎడ్రసిచ్చి మరీమరీ చెప్పింది మీ ఇంటికి వెళ్లి చూసిరమ్మని. ఈరోజుకి కుదిరింది" శ్రీధర్ నవ్వుతూ చెప్పాడు.

"అది చెప్పుండకపోతే వచ్చుండేవాడివి కాదన్నమాట. ఔనులే మర్చేపోయావ్ నన్ను. ఏం?" అన్నది శారద కినుకగా.

శ్రీధర్ రాకతో పుట్టిల్లూ, తన పరివారమూ వారి మమకారాలూ, స్నేహితులూ వారి అభిమానులూ తలపునకు వచ్చి శారదలో ఉత్సాహం పొంగిపొర్లింది.

శ్రీధర్‌తో ఊపిరి తిరక్కుండా కబుర్లు చెప్పింది. పేరుపేరునా తనవారి యోగక్షేమాలనడిగింది. తన మిత్రురాలి సంగతులు తెలుసుకుంది. బలవంతంగా అతని చేత టిఫిన్ తినిపించింది.

తనకంటే ఒకటి రెండు సంవత్సరాలు మాత్రమే చిన్న అయిన శ్రీధర్ తమని పేరుపెట్టే పిలిచేవాడు. తమతో కలిసి సందడి చేసేవాడు. కో ఎడ్యుకేషన్ కాలేజీలో బాడీగార్డుగా ఇంకో మగకన్ను తమమీద పడనిచ్చేవాడు కాదు.

గూడు కట్టుకున్న ఉదాసీనత కరిగిపోతుంటే అలుముకుంటున్న ఆహ్లాదం మనస్సును తేలికపరుస్తోంటే ఆనందకరమైన ఆ క్షణాలు తాత్కాలికమైనవే అన్న సంగతినే విస్మరించింది శారద.

శ్రీధర్‌కి పెళ్లి ఆల్బమ్ చూపిస్తూ అతని చెయ్యి, చొక్కా చివరా మాత్రమే పడిన ఒక ఫొటోని కుర్చీ మీదికి ఒంగి చూపిస్తూ పకపక నవ్వుకుంటున్న సమయంలో- సరిగ్గా అప్పుడు వచ్చాడు కుమార్.

మధుర స్వప్నం మధ్యలో మెలుకువ వచ్చి తిరిగి నిస్సార ప్రపంచంలోకి మరలివచ్చిన జీవిలా శారద ధుమధుమలాడుతోన్న భర్త మొహం చూసి నిటారుగా అయింది.

"హలో బావగారూ!" అని విష్ చేసిన శ్రీధర్‌కి తిరిగి 'హలో' అనగలిగేపాటి సంస్కారమన్నా చూపించలేదు కుమార్.

చురచుర కాల్చేసే చూపులు విసిరి, "పాపం అడ్డుగా వచ్చానా?" అని వక్రంగా అంటూ లోపలికి వెళ్లిపోయాడు.

ఖిన్నురాలయింది శారద.

బిత్తరపోయిన శ్రీధర్‌కి కాస్సేపటిదాకా దిక్కుతోచలేదు. వుండటానికి మనస్కరించక, ఆ వెంటనే వెళ్లిపోవటానికీ తటపటాయించి ఎలా అయితేనేం గొంతు పెగుల్చుకుని, శారదని జాలిగా చూసి, 'సారీ శారద' అని చెయ్యని తప్పుకి క్షమాపణ అడిగి వెళ్లిపోయాడు.

'ఇంటికొచ్చిన మనిషికిచ్చే మర్యాద ఇదా?' శారదలో బాధ, దుఃఖం, భర్త ఆటవిక మనస్తత్వం పట్ల కోపం, అతన్నేవిధంగానూ ఎదుర్కోలేకపోతున్న తన బలహీనత మీద చిరాకు కలగాపులగమై ఘోష పెట్టాయి.

విస్సురుగా లోపలికి వెళ్లింది. పడకగదిలో బట్టలయినా మార్చకుండా కాటు వెయ్యటానికి సిద్ధంగా వున్న పన్నాగంలా బుసలు కొడుతూ మంచంమీద పడుకొని వున్నాడు కుమార్.

"మీరేమంటున్నారో మీకేమయినా తెలుస్తోందా? అతనెవరనుకుంటున్నారు; నా స్నేహితురాలి తమ్ముడు; నాకంటే చిన్నవాడు; చూచిపోదామనొచ్చినతన్ని ఎంత అవమానపరిచి పంపించారు!" ఆక్రోశం, ఆవేదనా కలగలసిపోయాయి. భర్త ముందరకొచ్చి అంటున్న శారద కంఠంలో.

"ఓహో నువ్వు వాళ్ల వరసలూ పెద్దా చిన్నా తేడాలూ కూడా పాటిస్తావన్నమాట! ఎత్తుగా లావుగా, ఎర్రగా బుర్రగా వున్నాడుగదా- అదే చాలనుకున్నావనుకున్నానుసుమీ!" కుమార్ వెటకారంగా అన్నాడు.

చెవులు మూసుకున్నది శారద. "ఛిఛీ! ఎంత అన్యాయంగా మాట్లాడుతున్నారు!" నిజంగానే ఆ క్షణంలో శారదకు కుమార్ అంటే కలిగిన జుగుప్స అంతాఇంతా కాదు.

"ఏమిటీ అన్యాయం! పట్టపగలు తలుపులు తీసుకుని మరీ మీదపడిపోయి ఇక ఇకలూ పకపకలూ ఆడుతూ సరసాలాడుతున్నావే- అది అన్యాయం కాదా? నేను చూశానన్న జంకులేకుండా వాడిని అవమానించానని అడగొస్తున్నావే అది అన్యాయంకాదా? అసలు నిన్ను కాదే ఆ పెంపకాన్ననాలి. నీకు సంసారంచేసే లక్షణాలేమన్నా మప్పారా నీ అమ్మా నాన్నా!"

ఒళ్లు తెలియలేదు శారదకు. "అలా నోటికొచ్చినట్టు మాట్లాడకండి. పలకరించవచ్చిన పాపానికి ఆ అమాయకుడి మీద అంత నింద వేశారు. ఇంటికొచ్చిన అతిథిని గౌరవించినందుకు నాకు రంకు కట్టారు. నా పెంపకమెలాటిదైనా మీలాంటి కల్మషపు మనస్తత్వాన్ని మాత్రం నేర్పలేదు మావాళ్లు. ముక్కుపుటాలదిరిపోతోండగా అన్నది శారద.

"ఎంత పొగరే నీకు! రంకు మొగుణ్ణి ఇంట్లో చేర్చింది చాలక వాడికి పూజా సత్కారం చెయ్యనందుకు నాది మురికి బుద్ధంటావా? నన్ననటానికి ఎంత ధైర్యమే నీకు?" భార్య తెగబడుతోన్న వాసన సోకేసరికి కుమార్ రెచ్చిపోయి గొంతు పెంచేశాడు.

"అమాటే అనొద్దంటున్నాను. అతనికీ నాకూ ఏ సంబంధమూ లేదు. అతను నాకు తమ్ముడిలాంటివాడు. ఏ ఆడదీ మీరూహిస్తున్నట్టు సమయం దొరికితేచాలు దిగజారిపోతుందనుకోవద్దు. అందరు మగాళ్లూ మీకుమల్లే ఆడది కనిపిస్తే వెకిలితనం ప్రదర్శించరు. 'తనెంతో లోకమంతా' అనీ అందరూ మీలాంటివాళ్లే అనుకోకండి. ఎవరి నైతిక విలువలు వాళ్లకుంటాయి. అసలు మీ ఆగ్రహమంతా తమరి అనుజ్ఞ లేకుండా ఇంకొక మగమనిషితో మాట్లాడాననే కదా! నొక్కిపట్టడానికి కూడా ఓ హద్దు వున్నదండీ- ఆ హద్దు దాటితే పిల్లి కూడా తిరగబడుతుంది. అది తెలుసుకోండి" ఒళ్లు తెలియని ఆవేశంలో వున్న శారద కంఠంలో తెగింపు కనబడింది.

పశువయిపోయాడు కుమార్. "తప్పు చేసిందానివి నోరెత్తకుండా కుక్కిన పేనులా పడి వుండక ఎదురుతిరుగుతావటే. అసలు నిన్ను ఇంట్లో వుండనివ్వటమే తప్పు. ఫో ముందింట్లోంచి ఫో. పోయి నీ దిక్కున్నచోట చెప్పుకో ఫో...

తిడుతూ తిడుతూనే శారద మెడమీద చెయి వేసి గుమ్మందాకా నెట్టుకువచ్చి తలుపుతీసి విస్సురుగా బయటకు నెట్టి తలుపులు మూసుకున్నాడు కుమార్.

★ ★ ★

ఆవేదనగా వింటూండిపోయారు సీతారామయ్యగారు. కూతుర్ని పొదువుకొని కూర్చున్న తల్లి సుభద్రమ్మగారి మతి మతిలో లేదు.

శారద చెబుతోంది.

శతాబ్దాలుగా ఎక్కడో అడుగుపొరల్లో మరుగుతున్న లావా ఏ అనివార్య పరిస్థితుల్లోనో విజృంభించి పై పొరల్ని పెఠిల్లున ఛేదించుకుని

(→ 29వ పేజీ)

(←11 వ పేజీ)

పైకుబికినట్లు.

ఏళ్ల తరబడి గుండె లోతుల్లో గోప్యంగా దాచుకున్న చిత్తక్షోభ వెల్లడిస్తోంది.

తరతరాలుగా భర్తగా పిలవబడే పురుషుడన్న వాడి దౌష్ట్యాన్ని బయటపెడుతోంది.

భర్త నీచుడైనా, దుష్టుడైనా హీనుడైనా "మగవాణ్ణి-మొగుణ్ణి" అన్న అహంభావం తప్ప మరే ఇతర క్వాలిఫికేషన్లూ లేకపోయినా ఆడదై పుట్టిన పాపానికి అతని ఆధిక్యతని ఒప్పుకుని అతని దౌర్జన్యానికి ఎలా తల ఒగ్గుతోందో చెబుతోంది.

పెళ్లయి సంవత్సరం దాటిన నా భర్త ఇలా అని ఏనాడూ నోరుజారని తమ బిడ్డ ఈనాడిలా కడుపున దాచుకున్న బడబాగ్నిని బయటపెడుతోంటే చిత్తరువులై విన్నారు తల్లీ తండ్రీ.

"అందానికీ ధనానికే లోటనుకున్నానుగానీ గుణానిక్కూడా లోటున్నవాడని కనలేకపోయానమ్మా" అన్నారెలాగో చివరికి సీతారామయ్యగారు వ్యాకులంగా.

"కట్టుకున్నవాడు కానివాడయితే ఆడజన్మ ఆరళ్లపాలే తల్లీ" కన్నీళ్లు తుడుచుకున్నది తల్లి.

"నేను వెళ్లి అతనితో మాట్లాడి వస్తాను". అప్పటికప్పుడు బయలుదేరివెళ్లారు సీతారామయ్యగారు.

అలా వున్నపాటున ప్రయాణమై వెళ్లిన సీతారామయ్యగారు సాయంత్రానికి ఒంట్లో వున్న సత్తువంతా ఊడ్చుకుపోయినట్లు ఉసురుసురుమంటూ తిరిగివచ్చారు.

ఆయన నోటివెంట వచ్చిన మొదటిమాట, "సవరించలేని పొరపాటు చేసేనే నా బిడ్డని ఆ త్రాష్టుడికిచ్చి" అని.

"ఏమయింది. ఏమన్నాడల్లుడు." ఏమి వినవలసివస్తుందో అని ప్రాణం ఉగ్గబట్టుకునే అడిగింది సుభద్రమ్మ.

కూతురిచ్చిన మంచినీళ్లు తాగకుండానే ఊగిపోయారాయన. "మనిషిలా ప్రవర్తించలేదు. సుభద్రా వాడు పిచ్చిపట్టిన దుష్ట మృగంలా చెలరేగిపోయాడు. పూనకమొచ్చిన గణాచారిలా ఆడిపోయాడు."

శత్రువునికూడా ఎన్నడూ పరుషంగా దూషించని మేదకుడాయన. అలాటి మనిషి అదుపుతప్పి మాట తూలుతున్నాడంటే ఆయనక్కడ ఎంతటి పరాభవాన్ని ఎదుర్కొని వచ్చాడో ఊహించగలిగారందరూ.

మంచినీళ్లు తాగి కుదుటపడిన సీతారామయ్యగారి కంఠం రుద్ధమయింది.

శారద వంక చూస్తూ "వెళ్లంగానే వాడు నాకు చేసిన పురస్కారం ఏమిటో తెలుసా- నా మొహమ్మీద ఉమ్మేశాడమ్మా వాడు. నా తప్పిదమేమిటన్నాడో తెలుసా- కట్టు తప్పిన కూతుర్ని ఇంట్లో పెట్టుకున్నందుకట, జుట్టుపట్టుకుని ఈడ్చుకొచ్చి తన కాళ్లమీద పడేయనందుకట, ఇదేమిటని అడగవచ్చినందుకట."

తనని తాను సంబాళించుకున్నారు సీతారామయ్యగారు.

"ఎప్పుడొచ్చినా ముభావంగా, ముక్తసరిగా వుండేవాడు. రిజర్వుడు టైపు అనుకున్నానే గానీ ఇలా మేడిపండు వాటమనుకోలేదమ్మా"

ఒక్క నిమిషం ఆగి, "ఉచ్చం- నీచం, ఉచితానుచితాలు ఇంతగా పాటించని మనుషులున్నారంటే ఈ అనుభవాన్ని పొందకపోయుంటే నమ్మేవాణ్ణికాదు. ఇరుగుపొరుగుల్ని పిలిచాడు- అలగా మనిషిలా దారిని పొయ్యే పదిమందినీ పోగేశాడు. నన్ను నోరుమెదపనివ్వలేదు. నాకు ఆడపిల్లని పెంచాలో చేతకాదట. నీకు భయం, భక్తీ అణుకువా విధేయతా నేర్పలేదట. మొగుణ్ణి ఖాతరు చెయ్యవట. ఎదిరిస్తావట. తప్పులెన్నుతావట. తనని ఆఫీసుకుపంపి నాటకాలాడతావట. నిన్నటికి నిన్న ఎవడ్నో ఇంట్లో పెట్టుకుని కులుకుతున్నావట. పోనీలెమ్మని ఊరుకుంటే వచ్చిన నరసుడికి సన్మానం చెయ్యలేదని అలిగావుట. వాడి పర్సనాలిటీ ముందు నువ్వేంత నీ తాహతెంత అని ఎగిరిపడ్డావుట. తను కళ్లెర్ర చేసినందుకు నువ్వు వద్దు- నీ కొంపా వద్దు అని గుడిసె మీద దెబ్బకొట్టి లేచిపోయావట. కావాలంటే ఇటుపక్క వాళ్లతోనూ, అటుపక్క వాళ్లతోనూ సాక్ష్యమిప్పిస్తానంటాడు.

అమ్మా! ఇవన్నీ నేను వినటానికి యోగ్యమైన భాషలో చెప్తున్నాను. అతనువాడిన పదాలువింటే మర్యాదస్తులెవరైనా తలలు దించుకోవాల్సిందే. ఛీఛీ అలాగా మనిషిలా కారుకూతలు కూశాడు. నా కడుపు మండిపోయిందనుకో."

అందరిముందూ చిన్నబుచ్చిన ఆ చేదు అనుభవాన్ని జీర్ణించుకోలేకపోయిన గుర్తుగా తిరిగి చెప్తుంటే కూడా ఆయన మొహం జేవురించుకుపోయింది.

అదేసమయంలో సున్నిత మనస్కురాలయిన తన కూతుర్ని మానసికంగా అతనెంత హింసపెట్టివుంటాడో స్వయంగా గ్రహింపుకు వచ్చి గుండె నొక్కి పట్టినట్టుగా ఫీలైనారు.

శారద తలపైన చెయివేసి "ఆధూర్తుడిని ఇన్నాళ్లు పెదవి విప్పకుండా ఎలా భరించావమ్మా" అన్నారు కదిలిపోతూ. "వాడికి నువ్వంటే ఎంత లోకువ. ఎంత కసి- ఎంతసేపూ నువ్వు పదిమంది ముందరా తనకాళ్ల మీద పడాలంటాడు; తప్పు నాదే అని చెంపలేసుకోవాలంటాడు. ఇంకలాంటి పొరపాటు రానివ్వనని స్టాంపు కాగితంమీద సంతకం పెట్టి ఇవ్వాలంటాడు. ఇకనించీ కాలికింద చెప్పులా పడివుంటానంటేనే రానిచ్చేదంటాడు- నీమీద ఏమాత్రం ప్రేమాభిమానాలున్నా అట్లా పగతీర్చుకుంటున్నట్టు మాట్లాడగలడావాడు'. ఉహు- వాడు మనిషయి తేగదా మమతలూ, మమకారాలు తెలిసేది. వాడుత్త పశువు. వాడికి కావాల్సింది సహధర్మచారిణి కాదమ్మా గుంజకు కట్టేసి చావకొట్టినా కొమ్ము విసరని గొడ్డు.

వద్దమ్మా వద్దు. నువ్వా చెరసాలకు పోవద్దు. మనసులేని చోట, అవగాహనలేని మనిషితో మనుగడ సాగించరావలసినంత నరక మింకొకటుండదు. ఆ పెళ్లి- ఆ కాపురం పీడకలనుకో ఇక్కడే మాతోపాటు వుండిపో తల్లీ". ఉద్రేకాన్ని అతికష్టంమీద అణుచుకోవటంవల్ల శరీరం సన్నగా వణుకుతోంటే అన్నారు సీతారామయ్యగారు.

తలవాల్చి అన్నీ వింటూ స్థబ్దుగా వుండిపోయిన శారదకి మగడి అసభ్య ధోరణి తెలిసిందేకాబట్టి అంతగా ఆశ్చర్యపడలేదుగానీ సుభద్రమ్మగారు మాత్రం వడగళ్ల తాకిడి తిన్నదానిలా పాలిపోయింది.

★ ★ ★

ఆ రాత్రి ఆ ఇంట్లో ఎవరికీ సరిగా నిద్రపట్టలేదు.

తెలతెలవారుతోంటే సీతారామయ్యగారు లేచి పక్క మంచంమీద తెగ మసలుతున్న కూతురి దగ్గరకొచ్చి కూర్చున్నారు.

"అమ్మలూ:" అన్నారు మృదువుగా శారద తలపైన చెయివేసి. మూసుకున్న కనురెప్పలు తెర్చింది శారద.

"శారదా: ఏడాది కాలాన్ని వెనక్కి నెట్టేసి అప్పటి నాశారదలా నా దగ్గరే వుండిపోగలవా అమ్మా."

వయసొచ్చిన పిల్లల్ని ప్రాణ స్నేహితులుగా ప్రేమించే ఆ తలితండ్రుల ఆలనలో ఎంత ఉత్సాహ భరితంగా గడిచేవా రోజులు-

శారద కళ్లు తళుక్కుమన్నట్టుగా మెరిశాయి.

"అవి మళ్లీ తిరిగి వస్తాయా నాన్నా".

"మనం కావాలనుకుంటే వస్తాయమ్మా. సంవత్సరం క్రితం వచ్చిన పీడకలలా ఆ పెళ్లిని మరిచిపోగలిగితే తప్పకుండా తిరిగొస్తాయి తల్లీ." దృఢంగా అన్నారు సీతారామయ్యగారు. "మనం ఇద్దరం అప్పటిలాగే ఉదయాన్నే తామర్ల చెరువు వరకూ దారిపక్క నిద్రమాను చెట్లమీది పక్షుల కూజితాల్ని గుర్తుపట్టుకుంటూ ఎవరి సాహిత్యాన్నో చర్చించుకుంటూ నడిచెళ్లి రావచ్చును.

సూర్యదేవుడు తన కిరణాలు సాచి రాత్రి కురిసిన మంచు ముత్యాలను అద్దుకోకముందే మన తోటలో ప్రతి మొక్క దగ్గరికి వెళ్లి కొత్త చివుళ్లు ఎన్ని వేసిందో కొత్త మొగ్గలెన్ని తొడిగిందో పూర్వంలాగే లెక్కపెట్టుకోవచ్చును.

అప్పటిలాగే మన పెరట్లో పూచిన పూలన్నీ మాలలు కట్టి నువ్వూ చెల్లీ మాధవాలయంలో పూజారి మావయ్యకిచ్చి రావచ్చును.

ప్రతిరోజు లాగే మన ఇంటివేల్పు గోపాలకృష్ణుడికి మీ అమ్మ హారతిచ్చాక ఆ దైవాన్ని నువ్వు అష్టపదులూ తరంగాలూ పాడి కీర్తించవచ్చును." తండ్రి తన తలనిమురుతూ మంద్రస్థాయిలో చెబుతోన్న ఒకనాటి తన మామూలు దినచర్య కమ్మని జ్ఞాపకాలుగా మదిలో రూపుకడుతోంటే శారద కళ్లు అరమోడ్పులయ్యేయి.

"నీకు తెలుసా అమ్మలూ గోపీకృష్ణ మొన్న వచ్చేటప్పుడు రెండు కుందేళ్లని పట్టుకొచ్చేడు. ఎంత బావున్నాయో అవి. శాంతి వాటి నుదుటన గోరింతాకుతో ఎర్రటి బొట్లు పెట్టింది. రేపటి నుంచీ మన తువ్వాయితోపాటు వాటి పోషణ కూడా నీదే. వాటి వెనకతల పరుగెట్టి పట్టుకోటం, లేత ఆకులు కత్తిరించి వాటిని తినిపించటం... ఎంత అందమైన కాలక్షేపమో కదూ! ఇంకా... అర్ధాంతంగా నువ్వాపేసిన వీణ మళ్లీ సాధన చేసుకుందువు. ఇంకా టైముంటే పక్క వూళ్లో నీకిష్టమైన ఏదో కోర్సులో చేరి చదువుకుందువు." తన కూతురి హృదయం ఎంత తీవ్రంగా గాయపడిందో ఆయనకు తెలుసు. కనిపించని ఆ గాయాలకు లాలన అనే నవనీతం పూయాలనీ స్థంభించిన మనస్సుకు తిరిగి చైతన్యం కలిగించాలనే తాపత్రయమా కన్నతండ్రిది.

ఈ లోపల మగత నిద్రలో వున్న సుభద్రమ్మకు భర్తా కూతురూ మాట్లాడుకోవటం లీలగా వినిపించి లేచివచ్చి వారి పక్కనే కూర్చుంది.

"భర్త ఎలాటి వాడయినా వా దైవమని పట్టుకువేలాడ్డమే పాతివ్రత్యమనే రోజులు కావివి. కాలం చాలా మారిందమ్మా. లోకులేవో అనుకుని పోతారనీ, నీమూలంగా మాకేవో ఇబ్బందులుంటాయనీ అనుకోకు. మేము కన్నబిడ్డవి నువ్వు. నీకండగా మేమెప్పుడూ వుంటాం తల్లీ." అన్నదావిడ కూడా.

వారి మాటలు శారదకెంతో ఉపశమనాన్ని కలిగించాయి. "వుండగలనమ్మా. నేనిక్కడ సంతోషంగా వుండగలను." అన్నది పొంగిపోతున్న గుండెతో.

కానీ- వారా నిర్ణయానికి వచ్చి కొన్ని గంటలు గడవకముందే దాన్ని మార్చుకోవాల్సిరావటం నిజంగా దురదృష్టకరం

తెల్లవారుతోనే పళ్లు బ్రష్ చేసుకోబోతూ శారద వాంతి చేసుకున్నది. కాఫీ తాగబోతూ మరొకటి... టిఫిన్ తిని ఇంకొకటి.

కూతుర్ని ఏవో ప్రశ్నలు వేసి కారణం తెలుసుకున్న సుభద్రమ్మ మొహం వివర్ణమయింది. విషయం విన్న సీతారామయ్యగారు కాస్సేపటిదాకా మాటరానట్టుండిపోయారు.

ఆ తరవాత "తానొకటి తలిస్తే దైవమొకటి తలిచేను" అని ఇందుకే అంటారేమోనమ్మా. మన నిర్ణయాన్ని ఆ భగవంతుడు హర్షించలేదు. నిన్ను నా రెక్కల కింద దాచుకోవాలనే ఆశవున్నది కానీ అతని అంకురాన్ని అతన్నించి విడదీసే హక్కు నాకులేదు. నువ్వతని దగ్గరకు వెళ్లక తప్పదమ్మా" అన్నారు నిర్లిప్తంగా.

ఆయనమాత్రం ఏంచెయ్యగలరు. ఒక బిడ్డ మానసిక పెరుగుదల ఆరోగ్యంగా వుండాలన్నా సమాజపరంగా చులకన కాకుండా వుండాలన్నా తల్లేకాక తండ్రి సంరక్షణ కూడా చాలా ముఖ్యమని ఆయనకు తెలుసు.

గర్భవతియైన కుమార్తెను వివాహబంధంనించి తప్పించాలనుకోవటం తొందరపాటు చర్య అవుతుందేమోననీ, రేపాపుట్టిన బిడ్డ తండ్రి త్యజించిన పిల్లవాడుగా ఎదిగి సమాజపరంగా అవహేళనకూ, తిరస్కృతికీ లోనయితే తనకు తండ్రిని దూరంచేసిన తల్లినీ, తననీ దూషిస్తాడేమోననీ, దురదృష్టవశాత్తూ ఆ బిడ్డ ఆడపిల్లయితే ఆ పిల్ల భవిష్యత్తుకు అడుగడుగునా మరిన్ని ఆటంకాలెదురైతే అందుకు కారకులు మీరని తమని వేలెత్తి చూపుతుందేమోననీ ముందుకాలంలోకి తొంగిచూసి భయపడుతున్నాడాయన.

కొన్ని క్షణాల నిశ్శబ్దం తరవాత ఒక స్థిర నిశ్చయానికొచ్చినట్టు శారద లేచి నిలబడి "నేను వెడుతున్నాను నాన్నా" అన్నది.

"నువ్వొక్కదానివేనా- ఒద్దమ్మా నేను కూడా వస్తాను. అతనసలే దుడుకుమీదున్నాడు. నేను వెనకవుంటే కాస్త..."

"నేను వెళ్లేది అతని దగ్గరికి కాదు నాన్నా. ఆస్పత్రికి" తండ్రిని ఆపిచెప్పింది శారద.

"ఆస్పత్రికా, ఎందుకు"

"నాకీబిడ్డ ఒద్దు నాన్నా. ఇప్పటివరకూ ఆ ఇంట్లో నా మనుగడకు గడ్డి పరకకిచ్చే ప్రాధాన్యత లేదు. ఇక వెళ్లబోయేది అతని కాలికింద దుమ్మునై పడి వుండేటట్లయితేనే నాకక్కడ చోటు దొరికేదని అతను అన్నది మీరే చెప్పారు. అదీ అక్కడి నా స్థానం.

చెప్పండి నాన్నా నాకంటూ చిన్నమెత్తు విలువ లేని ఆ ఇంట్లో, నియంతృత్వం తప్ప ఆరోగ్యకరమైన వాతావరణం లేని ఆ ఇంట్లో తల్లిగా ఆ బిడ్డకి నేను న్యాయం చెయ్యగలనంటారా?

నా ఆశలకనుగుణంగా, సక్రమంగా పెంచగలననే విశ్వాసం లేకపోయాక ఆ పుట్టబోయే ప్రాణికోసమంటూ నా ఆత్మని చంపుకుని చీకటి గుయ్యారంలో బానిస బ్రతుకులాంటి ఆ జీవితంలోకి తిరిగి వెళ్లమంటరా నాన్నా?

కఠినురాలిననుకున్నానరే- ఆ బిడ్డకోసమే నేనా ఇంటికి వెళ్లాల్సి వస్తే నాకా బిడ్డే వద్దు నాన్నా. నరకం నుండి ముక్తి పొందాననుకుంటున్న నన్ను మళ్లీ అటు నెట్టకండి." శారద చేతులు జోడించి వలవరిస్తున్నట్టుగా అంటున్నది.

పొరపాటున సాలెగూడులో చిక్కుకున్న తూనీగ ఒకటి గిలగిల కొట్టుకుంటున్నది. సీతారామయ్యగారు పట్టుబడిన దాని కాళ్లు విడిపించి అది స్వేచ్ఛగా ఎగిరిపోతోంటే తృప్తిగా చూశారు.

"పద శారదా నీకు సాయం నేను వస్తాను" అన్నది సుభద్రమ్మ.

*